క్లుప్తంగా

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన పీఎంపీ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

నిడమర్రు: వైద్యం కోసం వచ్చిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్న ఫిర్యాదుపై నిందితుడైన పీఎంపీ వైద్యుడు అడపా సత్యనారాయణను సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నక్కా రజనీకుమార్, ఎస్సై లంక రాజేష్ తెలిపారు. నిడమర్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక కడుపునొప్పితో బాధపడుతూ సదరు పీఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో అతను బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు నిడమర్రు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలి వాగ్మూలం, అవసరమైన ఆధారాలు సేకరించి, దర్యాప్తులో లభించిన నిరూపణల ఆధారంగా నిందితుడిని అరెస్టు చేశామన్నారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు వారు వెల్లడించారు.

ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీల విజేతలు వీరే

భీమవరం: గాంధీ జయంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీల విజేతల వివరాలను మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు పత్రికలకు విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో విద్యార్థులకు 'మహాత్మాగాంధీ సత్యం, అహింస విధానాలు నేటి పరిస్థితులు' అనేక అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వీటిలో 21 ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయగా విజేతలకు అక్టోబర్ 2న పెదనిండ్రకొలనులోని మహాత్మాగాంధీ భవనంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు.

పాఠశాల స్థాయి విజేతల వివరాలు

జి దేవవర్షిణి (అనాకోడేరు), ఎస్ చాన్‌బాబు (జీలకర్రగూడెం), పి జయశ్రీ (వట్లూరు), జి.ప్రీతిక (భీమవరం), కె.ప్రవల్లిక (మేడపాడు), జి.అర్చన (కామవరపుకోట), కె.గాయత్రి (పెనుమంట్ర), జె.సంయుక్త (తాడేపల్లిగూడెం), ఎస్.లూధర్ (దర్భిపర్రు), కె.చంద్రిక (పెదనిండ్రకొలను), బి.షైనీ (ఆకివీడు), కె.స్నేహ (పాలకోడేరు), సీహెచ్ దీవెన (పత్తేపురం), ఆర్.చరణతేజ (చినఅమిరం), పి సాయిలక్ష్మి (బలుసుమూడి), కె.లహరి (పెదఅమిరం).

కళాశాల స్థాయి విజేతల వివరాలు

జి.భానుశ్రీ (పెన్నాడ), కె.షణ్ముక్ (ఏలూరు), వి.మీరాసహస్ర (తాడేపల్లిగూడెం), కె లీలాప్రసన్న (తణుకు), బి.వెంకటలక్ష్మి (భీమవరం).

బడిలో చేరిన చిన్నారులు

పెంటపాడు: గూడెంలో చెత్త ఏరుకుంటున్న ఇద్దరు చిన్నారులను సోమవారం పరిమెళ్ల ప్రభుత్వ పాఠశాలలో ఎంఈవో ఎం.శ్రీనివాస్ చేర్పించారు. కలెక్టర్ నాగరాణి, డీఈవో అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాజేష్ ఆధ్వర్యంలో పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.

జాగ్రత్తలతో హృదయం పదిలమే!

- గుండె జబ్బులకు జీవనశైలే ప్రధాన కారణం
- లక్షణాలను గుర్తించి సకాలంలో చికిత్స పొందితే ముప్పు తగ్గే అవకాశం
- నేడు ప్రపంచ హృదయ దినోత్సవం


గుండెపోటుకు గురైన వ్యక్తి (ప్రతీతాత్మక చిత్రం)


పార్క్‌లో ఉదయాన్నే వాకింగ్, వ్యాయామాలు

ద్వారకాతిరుమల, కామవరపుకోట : నేటి ఉరుకులు పరుగుల జీవితం, మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం, పొగతాగడం వంటి అలవాట్లు మానవ గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా వయసుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. గుండె జబ్బులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతిఏటా సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం, ప్రమాద కారకాలను ముందుగానే గుర్తించడం, అత్యవసర పరిస్థితుల్లో సత్వర చికిత్స అందేలా చూడటమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం.

చిన్న వయసులోనే ముప్పు

ఒకప్పుడు వృద్ధాప్యంలో ఎక్కువగా కనిపించే గుండెపోటు, ఇప్పుడు చిన్న వయసులోనే అధికంగా నమోదవుతోంది. ఉత్తర భారతదేశ గుండెపోటు పరిశోధనా రిజిస్ట్రీ ఆధారంగా ప్రచురితమైన అధ్యయనాల్లో 50 ఏళ్లలోపు వారే మూడో వంతుకు పైగా బాధితులుగా ఉన్నట్లు వెల్లడైంది. పొగాకు వినియోగం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ అసమతుల్యత చిన్న వయసులోనే ఈ ముప్పును పెంచుతున్నాయి. మరోవైపు, కోవిడ్‌వ్యాక్సిన్ల వల్ల హార్ట్ ఎటాక్‌లు పెరిగాయన్న ప్రచారానికి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవని, ఇన్‌ఫెక్షన్లు లేదా ఇతర అనారోగ్య సమస్యలే దీనికి కారణమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

గుండెపోటు లక్షణాలు

గుండెపోటు వచ్చినప్పుడు ఛాతీ మధ్యలో బిగుతు, ఒత్తిడి, నొప్పి లేదా మంట ఉండవచ్చు. ఈ అసౌకర్యం చేతి, భుజం, వీపు, మెడ, దవడ లేదా పొట్ట వైపు పాకడంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చల్లటి చెమటలు, వికారం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మహిళలు, వృద్ధులు, మధుమేహం ఉన్నవారిలో ఈ లక్షణాలు కొంత భిన్నంగా ఉండవచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే బాధితుడిని నడిపించకుండా ప్రశాంతంగా కూర్చోబెట్టి అత్యవసర వైద్య సహాయం కోసం ఆసుపత్రికి తరలించాలి. వైద్యుల సూచన లేకుండా ఎలాంటి మందులూ ఇవ్వకూడదు. శ్వాస లేకపోతే శిక్షణ పొందినవారు తక్షణమే సీపీఆర్ అందించాలి. గుండెపోటు అనుమానం వచ్చినప్పుడు ప్రతి నిమిషం కీలకమే.

తక్షణ వైద్యసహాయం అవసరం



మారిన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వల్ల చిన్న వయసులోనూ గుండెపోటు ముప్పు పెరుగుతోంది. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, అధిక బరువును అదుపులో ఉంచుకోవాలి. ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలను తగ్గించి.. కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. పొగతాగడం మానేసి.. రోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయాలి. ఛాతీలో బిగుతు, నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి.

– డాక్టర్ సీహెచ్‌వీ బలరామకృష్ణ, డీఎం (కార్డియాలజీ)బెంగుళూరు

జీవనశైలి మార్పుతో మేలు



ఒత్తిడిని తగ్గించుకుని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేయటం, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉంటూ, జంక్ ఫుడ్స్, నూనె పదార్థాలను తగ్గించాలి. గుండెకు మేలు చేసే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి మంచి ఆహారపు అలవాట్లతో జీవనశైలిని మార్పు చేసుకోగలిగితే గుండె ఆరోగ్యంగా ఉండి, ఆనందంగా జీవించగలుగుతాం.

– డాక్టర్ ఎస్.వేణు, కార్డియాలజిస్ట్, విజయ హాస్పిటల్, జంగారెడ్డిగూడెం

మహిళ హత్య కేసులో నిందితులకు రిమాండ్

విజయవాడ లీగల్: ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో లభ్యమైన మహిళ మొండేనికి సంబంధించిన కేసులో నిందితులకు వచ్చే నెల 9వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ 5వ అదనపు జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వారిని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. ఈనెల 18న ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ పంప్‌హౌస్ వద్ద కూలింగ్ కెనాల్‌లో మహిళ మొండెం తేలుతున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర బాబు ఆదేశాల మేరకు పశ్చిమ జోన్ డీసీపీ గుణ్ణం రామకృష్ణ, పశ్చిమ డివిజన్ ఏసీపీ ఎస్ఎస్‌వీకే దుర్గారావు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఎ.సుబ్రహ్మణ్యం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి డ్రోన్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సాయంతో కెనాల్‌లోని శరీర భాగాలను వెలికితీశారు.

టాటూ ఆధారంగా..

అనంతరం మృతదేహం చేతిపై ఉన్న నెమలి పించెం టాటూ ఆధారంగా మీడియా, ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లలో ప్రచారం చేయగా, మృతురాలు ఏలూరు జిల్లా కలిదిండి మండలం చిన్న తాడినాడకు చెందిన కర్రి దుర్గా కల్యాణి (29)గా గుర్తించారు. ఆమె ప్రస్తుతం మంగళగిరిలో నివసిస్తోంది. విచారణలో దుర్గ కల్యాణి ఒక హోటల్ యజమానితో సహజీవనం చేయగా బాబుకు జన్మనిచ్చి, ఆ బాబును భవానీపురం హెచ్.బి. కాలనీకి చెందిన మాంసం వ్యాపారి షేక్ షఫీ (46)కి దత్తత ఇచ్చింది. ప్రతిసారి డబ్బులు కావాలని వేధించడంతోపాటు బాబు విషయంలో గొడవలతో షఫీ ఈనెల 17న ఆమెను ఇంటికి పిలిచి, మటన్ కత్తితో హత్య చేశాడు. దీనికి అతని స్నేహితుడు షేక్ అబ్దుల్లా అలియాస్ దుర్గారావు సహాయం తీసుకొని, మృతదేహాన్ని ముక్కలు చేసి తుమ్మలపాలెం, గొల్లపూడి కూలింగ్ కెనాల్‌లో పడేశాడు. పోలీసులు ఇరువురిని అరెస్టు చేసి సోమవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

కొల్లేరు సమాచారాన్ని అక్టోబర్ 5లోగా సమర్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతీలాల్ దండే

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి సంబంధించి కేంద్ర సాధికార కమిటీ కోరిన పూర్తి సమాచారాన్ని అక్టోబర్ 5వ తేదీలోగా సమర్పించాలని పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతీలాల్ దండే అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతీలాల్ దండే మాట్లాడుతూ, కొల్లేరు 5వ కాంటూర్ పరిధిలోని అభయారణ్యం సరిహద్దుల హేతుబద్ధీకరణ, జిరాయితీ, డీ–ఫారం భూమిదారుల పునరావాస కార్యక్రమాలపై రూపొందించిన ప్రతిపాదనలను సుప్రీంకోర్టు కమిటీకి సమర్పించామన్నారు. ఈ నివేదికను పరిశీలించిన కమిటీ మరికొంత సమాచారం కోరిందని తెలిపారు. సంరక్షణ కేంద్రం ప్రస్తుత విస్తీర్ణం, సరిహద్దుల హేతుబద్ధీకరణ తర్వాత భూముల వివరాలు, జిరాయితీదారుల తరలింపునకు మండలాల వారీగా ప్రతిపాదిత భూములు, జిల్లా, మండలాల సరిహద్దులు, ప్రభుత్వ, జిరాయితీ, డీ–పట్టా భూములు, ఉప్పుటేరు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పక్షుల ప్రాంతాలు, నోటిఫైడ్, నాన్–నోటిఫైడ్ డ్రైన్ల వంటి అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు ఈ వివరాలను అక్టోబర్ 5లోగా కలెక్టర్‌కు ఇవ్వాలని, ఏలూరు జిల్లా కలెక్టర్ అక్టోబర్ 6 నాటికి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్లు ఎంజే అభిషేక్ గౌడ, కేఆర్ కల్పశ్రీ, డీఎఫ్‌ఓలు సందీప్ రెడ్డి, త్రిమూర్తులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునీంద్రబాబు మృతిపై కన్నాపురంలో ఉద్రిక్తత


కన్నాపురంలో నిందితుడి ఇంటిని కూల్చివేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండలంలోని కన్నాపురం గ్రామానికి చెందిన పల్లికొండ మునీంద్రబాబు (35) మృతి ఉదంతం కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న రాత్రి 9 గంటల సమయంలో గ్రామానికి చెందిన గెల్లా చందు పిలవడంతో మునీంద్రబాబు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించగా, 26న రాత్రి గోపాలపురం మండలం నందిగూడెం శివారులో ఆయన బైక్ లభ్యమైంది. దీనిపై బాధితుడి సోదరుడు మధుశేఖర్ కొయ్యలగూడెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, 27వ తేదీ రాత్రి దేవరపల్లి గ్రామం వద్ద పోలవరం కాలువలో ఒక పురుషుడి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి పరిశీలించగా, అది మునీంద్రబాబు మృతదేహమని గుర్తించారు. మృతుడి తలపై గాయాలు ఉండటం, చివరిసారిగా గెల్లా చందు, ఆయనపర్తి సంజయ్‌లతో కలిసి కనిపించడంతో వారిపై అనుమానం ఉందని మృతుడి సోదరుడు ఫిర్యాదు చేశారు. దీంతో మొదట అదృశ్యంగా నమోదైన కేసును, హత్య అనుమానాస్పద కేసుగా మార్చి ఎస్సై దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిందితుడి ఇల్లు కూల్చివేత

మునీంద్రబాబు మృతికి కారణమైన వ్యక్తిని వెంటనే శిక్షించాలంటూ స్థానికులు, బంధువులు ఆందోళనకు దిగడంతో కన్నాపురంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మునీంద్రబాబు వద్ద కార్పెంటర్‌గా పని చేసే వ్యక్తినే కావాలనే ఈ హత్యకు పాల్పడ్డాడని స్థానికులు ఆరోపించారు. ఈ నిందితుడు గతంలో గవరవరం నుంచి కన్నాపురం వచ్చి భార్యాపిల్లలతో కలిసి స్థిరపడినట్లు తెలిసింది. హత్యోదంతానికి కారణమైన వ్యక్తిపై ఆగ్రహించిన మృతుడి బంధువులు, మిత్రులు సోమవారం గ్రామంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. నిందితుడి ఇంటిని జేసీబీతో నేలమట్టం చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యోదంతం, ఇల్లు ధ్వంసం చేసిన ఘటనలపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు.

అనధికారిక పొగాకు విక్రయానికి ప్రత్యేక అనుమతి

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు బోర్డు నిర్దేశించిన పరిమితికి మించి పండించిన, అనధికారిక పొగాకు విక్రయానికి ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ ఒక్క పంట కాలానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతి మంజూరు చేసినట్లు కొయ్యలగూడెం పొగాకు బోర్డు సూపరింటెండెంట్ వి.శివ కుమార్ సోమవారం తెలిపారు. 60 క్వింటాళ్ల వరకు ఆక్షన్ సూపరింటెండెంట్ స్థాయిలో, 60 మించి 80 క్వింటాళ్ల వరకు రీజినల్ మేనేజర్ స్థాయిలో, అలాగే 80 క్వింటాళ్లకు మించి పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం, గుంటూరు నుంచి అనుమతి పొందడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. 2026–27 పంట కాలానికి సంబంధించి 2025–28 బ్లాక్ పీరియడ్ రిజిస్ట్రేషన్ నిబంధనల ప్రకారం, గత పంట కాలంలో రిజిస్టర్ చేయబడిన బ్యారెన్లలో అన్‌ఫిట్ గా ప్రకటించబడిన బ్యారెన్లు మినహా మిగిలిన అన్ని బ్యారెన్ల రిజిస్ట్రేషన్ రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసినట్లు శివ కుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు సంబంధించిన రసీదులను రైతులకు పొగాకు బోర్డు కార్యాలయంలో అందిస్తామన్నారు.

బాలికపై అఘాయిత్యం కేసులో 6 నెలల జైలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మైనర్ బాలికపై అఘాయిత్యం కేసులో ముద్దాయికి కోర్టు 6 నెలల జైలు శిక్ష విధించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది ఫిబ్రవరి 26న బాధితురాలు (వయస్సు 11 సంవత్సరాలు) ఇంటి సమీపంలోని కాగితాల రాంబాబు ఇంటి వద్ద మారేడు ఆకులు కోస్తుండగా, నిందితుడు రాంబాబు అక్కడికి వచ్చి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయంపై బాలిక భయపడి వెంటనే ఇంటికి వచ్చి, జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలపగా వారు ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్సై ఎం.కుటుంబరావు కేసు నమోదు చేశారు. అనంతరం ప్రస్తుత ధర్మాజీగూడెం ఎస్సై కె. వెంకన్న కేసు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో వాదప్రతివాదనలు విని, విచారణ జరిపిన ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి కానుగల వాణిశ్రీ... ముద్దాయి రాంబాబుపై నేరం రుజువైన నేపథ్యంలో అతనికి 6 నెలల జైలు శిక్షతో పాటు 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి..

ఉంగుటూరు: కుక్క అడ్డు రావడంతో మోటార్‌సైకిల్ అదుపు తప్పి పడిపోయిన ఘటనలో భార్యభర్తలు గాయపడ్డారు. గణపవరానికి చెందిన దంపతులు పూల గంగాధరరావు (59), సునీత మోటార్‌సైకిల్‌పై సోమవారం ఏలూరు ఆసుపత్రిలో ఉన్న బంధువులను చూసి తిరిగి స్వగ్రామం వస్తున్నారు. సీతారామపురం గ్రామం వద్ద అకస్మాత్తుగా అడ్డువచ్చిన కుక్కను ఢీకొనడంతో మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడి ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళపై అసభ్య ప్రవర్తన కేసులో ఏడాదిన్నర జైలు

కుక్కునూరు: మహిళపై అసభ్యంగా ప్రవర్తించి, ఆమె ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో నిందితుడికి జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జేడీ) కోర్టు జైలు శిక్ష విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటాపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ బూదేటి వెంకటేశ్వర్లు, అదే గ్రామానికి చెందిన మందపాటి నవనీత పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు, అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి భద్రాచలం డివిజన్ పరిధిలోని భూర్గంపాడు ఎస్సై జి.రవీందర్ కేసు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం కోర్టులో నేరం రుజువు కావడంతో సోమవారం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జేడీ) సీహెచ్ కిశోర్‌కుమార్ తీర్పు వెలువరించారు. నిందితుడికి ఏడాదిన్నర జైలు శిక్ష విధించారు. బాధితురాలికి రూ.10 వేల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కె.శ్యామల వాదనలు వినిపించారు. కేసు విచారణ పురోగతిని కుక్కునూరు ఎస్సై కె.రాజారెడ్డి పర్యవేక్షించగా, కోర్టు సంబంధిత విధులను కోర్టు పీసీ రామ్మూర్తిరాజు నిర్వహించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి : పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం - 530003.
Ph : 0891 - 2739126, Mobile : 96669 09050, E-mail: sbi.10077@sbi.co.in

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ జి. నాగేశ్వరరావు, మొబైల్ నెం.97045 57261

Appendix – IV – A
[See Proviso to rule 8(6)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

[illegible]

బహిరంగ ఇ-వేలం తేదీ & సమయము : 16-10-2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తుల వివరములు	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు ధర (రూ.)	బిడ్ పెంపుదల (రూ.)	తనిఖీ తేదీ మరియు సమయం
[illegible]	74,00,000/-	7,40,000/-	50,000/-	29-09-2026 నుండి 15-10-2026 వరకు, ఉ॥10 గం॥ల నుండి సా॥ 04. గం॥ల వరకు

[illegible]

తేదీ:24-09-2026, ప్రదేశము: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిజంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించవలసిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ ద్వారా బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



■ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను (M/F) Premalatha Super Speciality Dental Clinic, Nuzvid లోకల్ వారికి ప్రాధాన్యత. సెల్ : 9848470700. [C-1340801]

■ వృద్ధులు, ఆయలు, కేర్ టేకర్స్ నర్సులు, విజయవాడ బెంజిసర్కిల్ వద్ద హోమ్ కేర్ సర్వీస్ ఆఫీస్ నందు కావలెను. 9160835559 / 9701857559 [B-327]

